# ప్రభాత సూర్యుడు
తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 68 EDITOR:CHERUKU UPENDAR, DATE : SATURDAY 8 JULY 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 68, ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శనివారం 8 జూలై 2023 పేజీలు : 4 వెల : 5/-


## పట్టాలపైకి మరో 2 వందేభారత్‌లు



లక్నో- ప్రభాత సూర్యుడు

హైస్పీడ్ ట్రాక్‌లపై నడుస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం జోధ్‌పూర్ నుండి తన ప్రయాణాన్ని ప్రారంభించనుంది, జోధ్‌పూర్ రైల్వే స్టేషన్‌లో సన్నాహాలు పూర్తయ్యాయి. ఈ ప్రారంభోత్సవాన్ని ఘనంగా, చారిత్రాత్మకంగా నిర్వహించనున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ నుంచి

మిగతా 2లో...

# ప్రధాని సభను సక్సెస్ చేద్దాం..!



వరంగల్ - ప్రభాత సూర్యుడు



- తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే
- రాగానే వరంగల్ ఎయిర్ పోర్ట్ కు మొదటి ప్రాధాన్యత
- బీజేపీ పై చేస్తున్న విష ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దు
- కాంగ్రెస్?, బీఆర్ఎస్ రెండూ ఒకటే
- గతంలో కలిసి పనిచేశాయి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

ప్రధాని నరేంద్ర మోడీ వరంగల్ సభను సక్సెస్ చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి కోరారు. శనివారం ఉదయం భారీ కాన్వాయ్‌తో హైదరాబాద్ నుంచి వరంగల్ చేరుకున్న ఆయన.. భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రధాని సభ జరిగే ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలించిన అనంత అక్కడే మీడియాతో మాట్లాడారు. రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్, జాతీయ రహదారుల నిర్మాణానికి ప్రధాని భూమి పూజ చేస్తారు. తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు మోడీ ప్రభుత్వం కృషి చేస్తున్నది. తెలంగాణలో కేసీఆర్ కుటుంబం ప్రజాధనాన్ని ఎలా దుర్వినియోగం చేస్తున్నారో చూస్తున్నాం. కల్వకుంట్ల కుటుంబాన్ని ఫామ్ హౌజ్‌కు పరిమితం చేయాలి. రాష్ట్ర అభివృద్ధి కోసం ఈసారి బీజేపీని ఆశీర్వదించాలని ప్రధాని మోడీ కోరనున్నారు. మంత్రులు,ముఖ్యమంత్రి సచివాలయంకు పోయే పరిపాలన కావాలి. బీఆర్ఎస్, బీజేపీ ఎప్పుడూ కలిసిన దాఖలాలు లేవు.. ఇతర పార్టీలు చేసే విషప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దు. కాంగ్రెస్, బీఆర్ఎస్ గతంలో

మిగతా 3లో...

## రాహుల్‌కు హైకోర్టులో చుక్కెదురు

### 8 ఏళ్ల పోటీకి అనర్హత



న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు

మోదీ ఇంటిపేరుకు సంబంధించిన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీకి గుజరాత్ హైకోర్టు నుంచి పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. రాహుల్ గాంధీ పునర్విచారణ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. ట్రయల్ కోర్టు తీర్పు సరైనదేనని, ఆ ఉత్తర్వుపై జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని, అందుకే దరఖాస్తును కొట్టివేస్తున్నట్లు గుజరాత్ హైకోర్టు పేర్కొంది. రాహుల్‌గాంధీకి గుజరాత్ హైకోర్టులో చుక్కెదురు అయ్యింది. పరువు నష్టం కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెల్లడించింది. మోదీ ఇంటిపేరుపై వ్యాఖ్యానించినందుకు దోషిగా తేలిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి

మిగతా 2లో...

## 9 నుంచి వారాహి యాత్ర



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేపట్టిన వారాహి విజయ యాత్ర రెండో ఫేజ్ షెడ్యూల్ ఖరారైంది. ఏలూరు నుంచి రెండో విడత యాత్ర చేపట్టాలని

మిగతా 2లో...

# ధరణి..అక్రమాల పుట్ట

### 15 తర్వాత వివరాలు :రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ధరణి పోర్టల్ జరిగిన అక్రమాలను జులై 15 తర్వాత బయటపెడతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పూర్తి ఆధారాలతో ధరణి ఫైల్స్ విడుదల చేస్తామన్నారు. ధరణి పోర్టల్ అక్రమాలపై త్వరలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజలకు, మీడియాకు ధరణికి సంబంధించి టెర్రాసిస్ కంపెనీ మాత్రమే కనిపిస్తోందని, కానీ దీని వెనక పెద్ద మాఫియా దాగుందని ఆరోపించారు. అందుకు సంబంధించి ధరణి ఫైల్స్ ను ఆధారాలతో సహా సీరియల్‌గా బయటపెడతామన్నారు. ధరణి దోపిడీలపై అన్ని ఆధారాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామని పేర్కొన్నారు. ధరణిలో పెట్టుబడిదారులు ఎవరో కేంద్ర ప్రభుత్వం నిగ్గ తేల్చాలని



బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డికి సవాల్ విసురుతున్నానని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ధరణి రూపంలో ప్రజల ఆస్తులు, భూములు, వ్యక్తిగత వివరాలు విదేశీయుల చేతుల్లోకి వెళ్తున్నాయని ఆయన ఆరోపించారు. ధరణి పోర్టల్ లో బ్రిటిష్ ఐల్యాండ్‌కు సంబంధించిన పెట్టుబడులు ఉన్నాయని ఆరోపించారు. ధరణి మొత్తం కేటీఆర్

మిగతా 2లో...



## మోదీ వచ్చేది మన కోసమే..!

- కరీంనగర్ వరంగల్ ప్రజల చిరకాల వాంఛ
- 4 లేన్ పనులకు శంకుస్థాపన చేయబోతున్నారు
- తెలంగాణలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించబోతున్నారు
- మీవల్లే బీజేపీ అధికారంలోకి వచ్చే వాతావరణం ఏర్పడింది
- రేపు కనీవినీ ఎరగని రీతిలో జరగబోయే బహిరంగ సభను సక్సెస్ చేయండి

2లో...

## ఆ రెండు పార్టీలు బొమ్మా..బొరుసు



వరంగల్ - ప్రభాత సూర్యుడు

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బొమ్మ, బొరుసు లాంటివని.. ఆ రెండు పార్టీల డీఎన్ఏ ఒకటేనని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. బీజేపీ ఏనాడూ కాంగ్రెస్‌తో గానీ, బీఆర్ఎస్‌తో గానీ కలిసిన దాఖలాలు లేవన్నారు. కానీ.. గతంలో ఆ రెండు పార్టీలు కలిసి పని చేశాయని, ప్రభుత్వాన్నీ పంచుకున్నాయని అన్నారు. వరంగల్ జిల్లాలోని హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానాన్ని సందర్శించిన కిషన్ రెడ్డి.. అక్కడ ప్రధాని నరేంద్ర మోడీ సభా ఏర్పాట్లను పరిశీలించారు.
అనంతరం సభా ప్రాంగణంలో

మిగతా 2లో...

# మోడీ టూర్ బహిష్కరిస్తున్నాం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణ పుట్టుకనే అవమానించిన దుర్మార్గపు ప్రధాని నరేంద్ర మోదీ వరంగల్ పర్యనను తాము బహిష్కరిస్తున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ప్రకటించారు. తల్లిని చంపి బిడ్డను వేరి చేసినట్లు.. తెలంగాణను ఏపీ నుంచి వేరు చేశారని నాడు ప్రధాని చేసిన కామెంట్లను గుర్తు చేశారు. ఏ మొహం పెట్టుకొని ప్రధాని తెలంగాణకు వస్తున్నారని ప్రశ్నించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్ లో మంత్రులు జగదీష్ రెడ్డి, సత్యవతి రాథోడ్ లతో కలిసి మంత్రి కేటీఆర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈక్రమంలోనే ఆయన ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర విమర్శలు చేశారు. విభజన హామీల్లో ప్రధాని మోదీ ఒక్కటి కూడా నెరవేర్చలని చెప్పుకొచ్చారు. గుజరాత్ కు రూ.20 వేల కోట్లతో కోచ్ ఫ్యాక్టరీ ఇచ్చారని.. తెలంగాణకు కేవలం 521 కోట్ల నిధులు ఇవ్వడం ఏంటని అడిగారు. తెలంగాణ పట్ల ప్రధాని మొసలి కన్నీరు కారుస్తున్నారని.. కానీ ఈ రాష్ట్ర ప్రజలు అంత అమాయకులు కాదని చెప్పారు. రేపటి(శనివారం) ప్రధాని పర్యటనను బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారంతేకాకుండా గిరిజన యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ హామీ ఏమైందని ప్రధాని మోదీని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు.. బీజేపీని, ప్రధాని మోదీని ఎందుకు విమర్శించరని ప్రశ్నించారు. గాంధీ భవన్ లో గాడ్సే దూరాడని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్న

మిగతా 3లో...

## కాంగ్రెస్‌లో గ్రూపుల గోల

నల్గొండ- ప్రభాత సూర్యుడు



భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గడిచిన నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యంలేదు. కాంగ్రెస్ తరపున గెలిచి అసెంబ్లీలో అధ్యక్షా? అనేవారు లేకపోవడంతో ఈసారి ఎలాగైనా భువనగిరి కోట మీద మూడు రంగుల జెండా ఎగరేయాలని పట్టుదలగా ఉన్నారట స్థానిక నాయకులు. ఈ క్రమంలోనే డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఈసారి పోటీకి సిద్ధమవుతున్నారు. హాత్ సే హాత్ జోడో యాత్ర, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్రతో పాటు రీజినల్ రింగ్

మిగతా 2లో...

# రాహుల్‌కు హైకోర్టులో చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం చాలా ముఖ్యమైన రోజు. మోదీ ఇంటిపేరుకు సంబంధించిన పరువు నష్టం కేసులో విధించిన శిక్షపై రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌పై గుజరాత్ హైకోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. ఈ నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలందరూ పార్టీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ అంశంపై గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హేమంత్ ప్రచాక్‌తో కూడిన సింగిల్ బెంచ్ తీర్పు వెలువరించారు. రాహుల్ గాంధీని సూరత్ కోర్టు దోషిగా నిర్ధారించి మార్చి 23న రెండేళ్ల జైలు శిక్ష విధించింది.రాహుల్ గాంధీపై కనీసం 10 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కోర్టు పేర్కొంది. హైకోర్టు ఈ నిర్ణయం తర్వాత, రాహుల్ గాంధీ ఇకపై 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయలేరు, అలాగే పార్లమెంటు సభ్యుని (ఎంపీ) హోదాపై సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోలేరు. హైకోర్టు ఆదేశాలపై సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకోవచ్చు. రాహుల్ లోక్ సభ సభ్యత్వం ఇప్పటికే ముగిసింది. అంతకుముందు రాహుల్ గాంధీ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు మధ్యంతర ఉపశమనం ఇవ్వడానికి నిరాకరించింది మరియు వేసవి సెలవుల తర్వాత తుది ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపింది.

2024 లోక్?సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. రాహుల్? గాంధీపై గుజరాత్? హైకోర్టు ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్? కు కూడా షాక్? తగిలినట్టు అయ్యింది. ఏదైనా కేసులో దోషిగా తేలితే, సంబంధిత వ్యక్తి 8ఏళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిబంధనల్లో ఉంది. అలాంటిది.. 2024 ఎన్నికల వేళ రాహుల్? గాంధీ పోటీ చేయకపోతే ఎలా? అని కాంగ్రెస్? శ్రేణుల్లో ఆందోళన మొదలైంది. హైకోర్టు తీర్పుపై ఇప్పుడు రాహుల్ గాంధీకి ఒక్కటే ఆప్షన్ మిగిలింది. అదే సుప్రీంకోర్టుకు వెళ్లడం . సుప్రీంకోర్టులో పిటిషన్ వేసుకుని రెండేళ్ల జైశిక్షపై స్టే తెచ్చుకుంటే తప్ప.. ఆయనకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉంది. ఇప్పుడు రాహుల్ గాంధీ ఏం చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఏదైనా నేరానికి పాల్పడి, రెండు సంవత్సరాల కంటే తక్కువ కాకుండా జైలు శిక్ష విధించబడిన వ్యక్తి ళిసబ్-సెక్షన్ (1) లేదా సబ్-సెక్షన్ (2)లో సూచించిన ఏదైనా నేరం కాకుండా అటువంటి నేరారోపణ తేదీ నుండి అనర్హులు అవుతారు . అతను విడుదలైనప్పటి నుండి మరో ఆరు సంవత్సరాల పాటు అనర్హుడిగా కొనసాగాలి. ఈ నిబంధన ప్రకారం రాహుల్ గాంధీ అనర్హుడవుతారు.సుప్రీంకోర్టులోనూ శిక్షపై స్టే లభించకపోతే ఆయన జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అన్ని రకాల న్యాయస్థానాల్లో అవకాశాలు కోల్పోయిన తర్వాత ఆయన .. జైలు శిక్షను అనుభవించాల్సి ఉంటుంది. ఇలా జైలుకు వెళ్తే.. పరువు నష్టం కేసులో జైలుకు వెళ్లిన ప్రధాని పదవికి పోటీ పడే నేతగా చరిత్రకెక్కుతారు. రెండేళ్ల పాటు జైల్లో ఉంది. విడుదలైన తర్వాత ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయాడనికి అనర్హులు అవుతారు. ఈ కారణంగా రాహుల్ గాంధీ సుప్రీంకోర్టులో వేయబోయే పిటిషన్‌పై ఆసక్తి ఏర్పడుతోంది.

# ఆ రెండు పార్టీలు బొమ్మా..బొరుసు

(మొదటిపేజీ తరువాయి)

మీడియాతో మాట్లాడుతూ.. చారిత్రాత్మకమైన వరంగల్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తొలిసారి వస్తున్నారన్నారు.రూ.6,109 కోట్లు జాతీయ రహదారులకు, రూ.521 కోట్లతో కాజీపేటలో రైల్వే వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు మోడీ శంకుస్థాపన చేస్తారని కిషన్ రెడ్డి తెలిపారు. తొలి దశలో రూ.521 కోట్లతో రైల్వే వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ని ఏర్పాటు చేస్తున్నామని.. దీని వల్ల 3వేల మందికి ఉద్యోగా అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఇందుకు తాను ప్రధాని మోడీకి తెలంగాణ రాష్ట్ర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. రేపు ప్రధాని మోడీ మూడు రాష్ట్రాల్లో పర్యటిస్తారని.. మొదట వరంగల్‌కు వస్తారని తెలియజేశారు. అభివృద్ధి కార్యక్రమాలు, అధికారిక కార్యక్రమాల అనంతరం విజయ సంకల్ప సభ ముఖ్యమైందని.. ఇది రాజకీయంగా ఎంతో కీలకమైన సభ అని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా బీజేపీపై అబద్ధాలు కుట్రపూరితంగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కుటుంబ పాలనకు వ్యతిరేకంగా ఏ విధంగా పోరాడుతున్నామో మోడీ వివరిస్తారని వెల్లడించారు. కల్వకుంట్ల కుటుంబ పాలనకు చరమగీతం పాడేలా బీజేపీ కృషి చేస్తోందన్నారు.

ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించిన కిషన్ రెడ్డి.. కల్వకుంట్ల కుటుంబ ప్రభుత్వాన్ని ఫామ్ హౌస్‌కు పరిమితం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కేసిఆర్ ప్రభుత్వం కమిషన్‌ల, వాటాల ప్రభుత్వంగా మారిందని వ్యాఖ్యానించారు. పెట్టుబడుల ప్రభుత్వంగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉందని.. బహుళజాతి కంపెనీలకు భారత్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని అన్నారు. అతిపెద్ద ఆర్థికాభివృద్ధి దేశంగా ఐదోస్థానంలో మనం ఉన్నామన్నారు. తాము తెలంగాణలో అధికారంలోకి వస్తే.. నిజమైన, నీతివంతమైన పాలనను తీసుకువస్తామని హామీ ఇచ్చారు. దేశంలో నీతివంతమైన పాలన మోడీ నేతృత్వంలో కొనసాగుతోందన్నారు. మోడీ స్ఫూర్తితో తెలంగాణలో కుటుంబరహిత నీతివంతమైన పాలనను తీసుకొస్తామన్నారు

# పట్టాలపైకి మరో 2 వందేభారత్‌లు

(మొదటిపేజీ తరువాయి)

రాజస్థాన్‌కు వెళ్లే రెండో వందేభారత్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం జెండా ఊపి ప్రారంభించనున్నారు. అదనంగా, ప్రధానమంత్రి తన పర్యటనలో మొత్తం రూ. 50 వేల కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేస్తారు. ఈ రైలు ప్రారంభ రోజున అంటే జూలై 7న గోరఖ్‌పూర్ నుండి లక్నో మధ్య నడుస్తుంది, అయితే ఆ తర్వాత ఈ రైలు జూలై 9 నుండి గోరఖ్‌పూర్ నుండి లక్నో మధ్య క్రమం తప్పకుండా నడుస్తుంది. ఆదివారం నుంచి సరికొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి వచ్చిన తర్వాత అయోధ్య లక్నో, గోరఖ్‌పూర్‌కు కేవలం రెండు గంటల దూరంలో మాత్రమే ఉంటుంది. ఎనిమిది కోచ్‌ల రైలును ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం జెండా ఊపి ప్రారంభించనున్నారు. 2024లో రామమందిర ప్రారంభోత్సవానికి ముందు.. అయోధ్యలో విమా నాశ్రయం పనులు పూర్తయ్యేలోపు ఈ రైలును ప్రారంభిస్తున్నారు.

ఇది ఉత్తరప్రదేశ్‌లోని రెండు అతిపెద్ద దేవాలయాలకు మెరుగైన కనెక్టివిటీని అందిస్తుంది ? రామజన్మభూమి, గోరఖ్‌నాథ్ ? ఒక అనుకూలమైన తీర్థయాత్ర మార్గంగా మారే అవకాశం ఉంది. ప్రస్తుతానికి, గోరఖ్‌పూర్ లేదా అయోధ్యలో శతాబ్ది లేదా రాజధాని కనెక్టివిటీ లేదు. వందే భారత్ అయోధ్య, గోరఖ్‌పూర్‌ని బాగా కనెక్ట్ చేసేలా చేస్తుంది. ఇది ఇంతకు ముందు లేదు.

# 9 నుంచి వారాహి యాత్ర

(మొదటిపేజీ తరువాయి)

పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఈనెల 9వ తేదీ సాయంత్రం 5గంటలకు ఏలూరులో నిర్వహించే బహిరంగసభతో యాత్ర ప్రారంభమవుతుందని జనసేన పార్టీ నేత పి.హరిప్రసాద్ తెలిపారు. వారాహియాత్రి రెండో దశ గురించి చర్చించేందుకు హైదరబాద్ నుంచి గన్నవరం వచ్చిన పవన్.. మంగళగిరి పార్టీ కార్యాలయంలో రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌తో సుదీర్ఘంగా చర్చించారు. ఈ భేటీలో ఏలూరుతో పాటు దెందులూరు, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, తణుకు నియోజకవర్గాల నాయకులతో స్థానిక రాజకీయ పరిస్థితులపై పవన్ చర్చించనున్నారు. ఇక పవన్ కల్యాణ్ చేపట్టిన తొలి విడత వారాహి యాత్ర సూపర్ సక్సెస్ అయింది. వారాహి యాత్రకు ప్రజల నుంచి భారీ స్పందన వచ్చింది. ఎక్కడ సభ పెట్టినా.. ఇసుకేస్తే రాలనంతగా ప్రజలు, జనసేన కార్యకర్తలు, పవన్ అభిమానులు తరలివచ్చారు. నిండుగా కనిపించిన పవన్ సభలు అధికార, ప్రతిపక్ష పార్టీల్లో సైతం ఆందోళన కలిగించాయి.

అయితే వారాహి తొలి విడత యాత్ర మొత్తం ప్రజా సమస్యలపై.. ప్రభుత్వంపై విమర్శలు చేశారు. అధికార పార్టీ నేతలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీంతో రెండో విడత యాత్రపై జనసేన పార్టీ, ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దృష్టి సారించారు. పశ్చిమగోదావరి నుంచే యాత్ర కొనసాగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# ధరణి..అక్రమాల పుట్ట

(మొదటిపేజీ తరువాయి)

మిత్రుడు గాదె శ్రీధర్ రాజు చేతుల్లో ఉందన్నారు. దారిదోపిడీ దొంగలకంటే భయంకరమైన దోపిడీ ధరణిలో జరుగుతోందన్నారు. లక్షల ఎకరాల ప్రభుత్వ భూములు మాయం అవుతున్నాయన్నారు. ధరణి పోర్టల్ నిర్వహణ విదేశీయుల చేతుల్లోకి వెళ్లిపోయిందని ఆరోపించారు. అందరి వివరాలు విదేశీయుల గుప్పిట్లో ఉన్నాయని, ఇది అత్యంత ప్రమాదకరమని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న సంస్థలో పెట్టుబడి పెట్టిన వారు ఆర్థిక నేరగాళ్లు. ధరణి పోర్టల్‌ను నిర్వహిస్తున్న వారిలో విదేశీయులు ఉన్నారు. ధరణి పోర్టల్ ఏ దేశ పౌరుడి చేతిలో ఉందో, అతడు ఎలాంటివాడో, దావూద్ ఇబ్రహీం కంటే పెద్ద మాఫియా నాయకుడో, ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్ అమ్ముకునే డ్రగ్ లార్డో మనకు తెలియదు. ఈ పోర్టల్ ద్వారా మన వివరాలన్నీ విదేశీయుల చేతుల్లోకి వెళ్తున్నాయి. అనేక చేతులు మారి చివరకు.. ధరణి పోర్టల్ బ్రిటిష్ ఐల్యాండ్ చేతికి వెళ్లింది. ధరణిలోని అనేక లోటుపాట్లను ఆసరాగా తీసుకొని నిషేధిత జాబితాలోని భూములను అనుచరులకు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూములను అనుచరులకు రిజిస్ట్రేషన్ చేసి వెంటనే ప్రొహిబిషన్ లాక్ చేస్తున్నారు. ధరణి పోర్టల్ మొత్తం కేటీఆర్ మిత్రుడు శ్రీధర్ గాదె చేతిలో ఉంది. శ్రీధర్ గాదె వద్ద ఉన్న తాళంతో ధరణిని ఎప్పుడైనా తెరవొచ్చు, ఒకరి పేరు మీద ఉన్న భూమిని మరొకరి పేరు మీద మార్చేయొచ్చు" అని రేవంత్ రెడ్డి వివరించారు.ప్రభుత్వ భూములకు యజమానులను సృష్టించడం, అనంతరం ఆ భూములను బదలాయించడం, ఆ తర్వాత వాటిని లేఅవుట్లు వేసి అమ్ముకోవడం... ఈ తతంగం ఇలా నడుస్తోందని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ధరణి పోర్టల్ సాయంతో కేసీఆర్ కుటుంబం దోచుకుంటోందని అన్నారు. దీనికంతటికీ కారకుడు శ్రీధర్ గాదె అలియాస్ గాదె శ్రీధర్ రాజు అని ఆరోపించారు. హైటెక్ సిటీ ప్రాంతంలో క్వాంటెల్లా అనే సంస్థ పేరిట ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. కోదండరెడ్డి కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి అనేక భూ అక్రమాలు జరుగుతున్నట్టు ప్రాథమిక వివరాలు రాబట్టింది అని రేవంత్ రెడ్డి వివరించారు. దేవాదాయ భూములను అక్రమంగా ఫార్మా కంపెనీలకు కట్టబెట్టాలని చూశారని ఆక్షేపించారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తానంటే కేసీఆర్ భయపడుతున్నారన్నారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ధరణిని రద్దు చేసి అంతకంటే మెరుగైన పోర్టల్‌ను తీసుకొస్తామన్నారు. కేసీఆర్ భూ అక్రమాలను కూడా బయటపెడతామన్నారు. ధరణిలో జరిగిన అక్రమాలను జులై 15 తర్వాత బయటపెడతామన్న రేవంత్ రెడ్డి... కేంద్రం తలచుకుంటే ధరణి వెనకున్న ఆర్థిక నేరాలను బహిర్గతం చేయొచ్చని పేర్కొన్నారు. గజ్వేల్ లో 1500 ఎకరాల అసైన్డ్ భూములను చట్టవిరుద్ధంగా ప్రభుత్వం గుంజుకుందన్నారని మండిపడ్డారు. అమూల్ డైరీకి వందల ఎకరాల కట్టబెట్టారన్నారు.కేటీఆర్ దిల్లీ పర్యటనతో బీజేపీ, బీఆర్ఎస్ ఫెవికాల్ బంధాన్ని బలోపేతం చేసేందుకు బీజం పడిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఎన్నికల అభ్యర్థులను మొట్టమొదట ప్రకటించాలని పార్టీలో చర్చలు జరిపామన్నారు. పేదల పక్షాన కాంగ్రెస్ ఉందని చాటే ప్రయత్నం చేసే దిశగా అధిష్టానం ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఈటల రాజేందర్ భద్రత పెంచినా... అనుమానితుడిపై ఎందుకు కేసు పెట్టలేదని ప్రశ్నించారు. ఎవరి వల్ల ప్రమాదం ఉందో రాజేందర్ స్పష్టంగా చెప్పారని, అయినా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కేసులు పెట్టలేదని నిలదీశారు. తన రక్షణ విషయంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను పట్టించుకోని ప్రభుత్వం...రాజేందర్ కు భద్రత ఏర్పాటు చేయడం సంతోషమని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

1. ధరణిలో తప్పుల వలన లక్షల మంది రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ-వ్యవస్థను రద్దు చేసి దీని స్థానంలో భూమి వాస్తవ పరిస్థితికి అద్దంపట్టి, తప్పులు లేని, అందరికీ అందుబాటులో ఉండే కొత్త కంప్యూటర్ రికార్డును రూపొందిస్తాం. ఇప్పుడున్న రికార్డు సమస్యలను అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి పరిష్కరిస్తాం.
2. నిషేధిత జాబితాలో చేర్చిన పట్టా భూములను కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిన 100 రోజుల్లోగా తొలగిస్తాం.
3. అన్ని రకాల భూముల సమగ్ర సర్వే చేసి కొత్త రికార్డులు రూపొందిస్తాం. వ్యవసాయ భూములకు, ఇంటి స్థలాలకు కొత్త పట్టాలు ఇస్తాం. భద్రమైన హక్కులు కల్పిస్తాం.
4. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత జరిగే తొలి శాసన సభా సమావేశంలోనే కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా మేరకు టైటిల్ గ్యారంటీ చట్టం చేసి ప్రభుత్వమే భూమి హక్కులకు పూర్తి హామీ ఇచ్చే వ్యవస్థను తెస్తాం.
5. వందకు పైగా ఉన్న భూచట్టాల స్థానంలో ఒకే భూమి చట్టం తెస్తాం.
6. కౌలుదారులకు రుణ అర్హత కార్డులు ఇచ్చేందుకు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన అధీకృత సాగుదారుల చట్టాన్ని అమలు చేస్తాం.
7. కాంగ్రెస్ తెచ్చిన భూ సంస్కరణల ద్వారా ఇప్పటి వరకు పేదలకు పంచిన పాతిక లక్షల ఎకరాల భూములపై సంపూర్ణ హక్కులు కల్పిస్తాం.
8. 2006లో కాంగ్రెస్ తెచ్చిన అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేసి అర్హులందరికీ పోడు భూములకు పట్టాలు ఇస్తాం.
9. కేంద్రం లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తెచ్చిన భూసేకరణ చట్టాన్ని యధాతథంగా అమలు చేస్తాం. రైతుల అనుమతి లేకుండా భూములు సేకరించం. అసైన్డ్ భూములకు, పోడు భూములకు కూడా పట్టా భూములతో సమానంగా నష్ట పరిహారం చెల్లిస్తాం. ఇప్పటి వరకు అలా నష్ట పరిహారం రాని వారికి న్యాయం చెయ్యడానికి రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యం లో కమిషన్ ఏర్పాటు చేస్తాం.
10. భూపరిపాలన వ్యవస్థను బలోపేతం చేస్తాం. గ్రామ నుండి రాష్ట్ర స్థాయి వరకు సిబ్బందిని నియమించి రైతులకు హక్కుల చిక్కులు లేకుండా చేస్తాం.
11. భూ సమస్యల పరిష్కారానికి జిల్లాకొక భూమి ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తామని రేవంత్ రెడ్డి కాంగ్రెస్ భూమి డిక్లరేషన్ లో అంశాలు తెలిపారు.

# మోదీ వచ్చేది మన కోసమే..!

(మొదటిపేజీ తరువాయి)

"ప్రధానమంత్రి నరేంద్రమోదీ నరేంద్రమోదీ వచ్చేది మనందరి కోసమే. జిల్లా ప్రజల చిరకాల వాంఛగా ఉన్న కరీంనగర్ వరంగల్ 4 లేన్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేయబోతున్నారు. దీంతోపాటు వేల కోట్ల రూపాయలను కేటాయించి తెలంగాణ ప్రజల కోసం అనేక అభివృద్ధి పనులను ప్రారంభించబోతున్నారు. ఈ నేపథ్యంలో రేపు హన్మకొండ ఆర్ట్స్ కాలేజీ లో జరగబోయే భారీ బహిరంగ సభకు కనీవినీ ఎరగని రీతిలో తరలివచ్చి సక్సెస్ చేయండి"అని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈరోజు ఉదయం తన కార్యాలయంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నేతలు, శక్తి కేంద్ర ఇంఛార్జీలతో బండి సంజయ్ సమావేశమయ్యారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, అధికార ప్రతినిధి రాణిరుద్రమదేవి, జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, సీనియర్ నేత బాస సత్యనారాయణరావు, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దరువు ఎల్లన్న, తాళ్లపల్లి శ్రీను, వాసుదేవరెడ్డి, కోమాల అంజన్న, రమేశ్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

**ఈ సందర్భంగా బండి సంజయ్ ఏమన్నారంటే**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ మనందరి కోసమే రేపు వరంగల్ జిల్లాకు వస్తున్నారు. జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన కరీంనగర్ ?వరంగల్ 4 లేన్ విస్తరణ పనులకు స్వయంగా శంకుస్థాపన చేయబోతున్నారు. దీంతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించబోతున్నారు. ఈ సందర్భంగా జరగబోయే బహిరంగ సభకు పెద్ద ఎత్తున హాజరై కనీవినీ ఎరగని రీతిలో సక్సెస్ చేయాలి. రేపు ఉదయమే సభ జరగబోతున్నందున నిర్ణీత సమయానికంటే ముందే సభాస్థలికి రావాలి. ఒక్కటి మాత్రం గుర్తుంచుకోండి. మనందరి లక్ష్యం తెలంగాణలో రామరాజ్య స్థాపనే. మీ అందరి కమిట్ మెంట్, పోరాట పటిమవల్లే ఈరోజు తెలంగాణలో బీజేపీకి అధికారం వస్తుందనే వాతావరణం ఏర్పడింది. మీరు తెగించి కొట్లాడటంవల్లే ప్రజలు ఆదరిస్తున్నారు. కొంతమంది బీజేపీకి వచ్చిన వాతావరణాన్ని చెడగొట్టేందుకు అనేక అనుమానాలను, అపోహలను సృష్టిస్తున్నారు. వాటికి తావివ్వకుండా అందరం కలిసి కట్టుగా పని చేయాలి. ప్రస్తుతం మోదీ బహిరంగ సభను సక్సెస్ చేయడమే మనముందున్న కర్తవ్యం. భారీ ఎత్తున తరలివెళ్లి కార్యకర్తల సత్తా చాటండి.

# కాంగ్రెస్‌లో గ్రూపుల గోల

(మొదటిపేజీ తరువాయి)

రోడ్డు బాధితులు, రాయగిరి రైతుల పక్షాన పోరాటం, బస్వాపురం భూ నిర్వాసితుల తరుపున నిలబడటం లాంటి కార్యక్రమాలతో ఉనికి చాటుకునే ప్రయత్నాల్లో ఉన్నారాయన. లోకల్ కేడర్ మధ్య కూడా పెద్దగా విభేదాల్లేవన్న ప్రచారం ఇన్నాళ్ళు జరిగింది. కానీ? అసెంబ్లీ ఎన్నికల ముంగిట్లో సీన్ మారుతున్నట్టు కనిపిస్తోందంటున్నాయి పార్టీ వర్గాలు. గ్రూపు రాజకీయాలు పెరిగి రచ్చ మొదలైందని చెబుతున్నాయి స్థానిక పరిస్థితులు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు కొందరు అనిల్ కుమార్ రెడ్డికి వ్యతిరేకంగా పనిచేశారట. ఇప్పుడు కూడా వాళ్ళే యాక్టివ్ అవుతున్నట్టు చెబుతున్నారు. నియోజకవర్గానికి చెందిన టీపీసీసీ సెక్రటరీ ప్రమోద్, మాజీ మున్సిపల్ చైర్మన్ జహంగీర్‌తో పాటు మరికొందరు గ్రూపుగా ఏర్పడి వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తాజాగా దశాబ్ది దగా కార్యక్రమాన్ని కూడా డీసీసీ అధ్యక్షుడితో కలిసి కాకుండా?భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఫ్లెక్సీతో మరోచోట నిర్వహించారు సదరు నాయకులు. అక్కడితో ఆగకుండా ఘట్ కేసర్‌లో రహస్యంగా సమావేశమైనట్టు తెలిసింది. భువనగిరి కాంగ్రెస్‌లో పెద్దగా విభేదాలు లేవనుకుంటున్న సమయంలో ఇలా గ్రూప్ రాజకీయాలు యాక్టివ్‌గా జరగడంపై కేడర్‌లో గందరగోళం పెరుగుతోందట. ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచనలతోనే గ్రూపుల గోల మొదలయిందని నియోజకవర్గ ముఖ్య నాయకులు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. డీసీసీ అధ్యక్షుడికి వ్యతిరేకంగా కోమటిరెడ్డే ఓ వర్గాన్ని పోషిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్‌కు చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యేపై అసంతృప్తి పెరగడం, రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితుల ఆక్రోశం వంటి పరిణామాలను సొమ్ము చేసుకుని పార్టీని పటిష్ఠం చేసుకోవాల్సిన సమయంలో ఇలా కొట్లాడుకుంటే? ఈసారి కూడా భువనగిరిని ప్రత్యర్థులకు వదిలేసుకోవడం తప్ప చేయగలిగేది ఏమీ ఉండదంటున్నారు ద్వితీయ శ్రేణి నాయకులు. ఇప్పుడిప్పుడే బలోపేతం అవుతున్నామని అనుకుంటున్న సమయంలో?ఈ గ్రూపుల గోల దారుణంగా దెబ్బతీస్తుందన్న ఆందోళన వారిలో కనిపిస్తోందట. పార్టీ అధినాయకత్వం వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దకుంటే? మరోసారి ఈ సీటు మీద ఆశలు వదిలేసుకోవాల్సిందేనన్నది లోకల్ కాంగ్రెస్ నాయకుల అభిప్రాయం. గాంధీభవన్ దీన్నెలా డీల్ చేస్తుందో చూడాలి.

## సంపాదకీయం

# 13 రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు

2023 ఎండింగ్‌లో అయిదు (తెలంగాణ, మిజోరం, రాజస్థాన్, మధ్య ప్రదేశ్, చత్తీస్‌గఢ్), వచ్చే సంవత్సరం లోక్‌సభ ఎన్నికలతోపాటు నాలుగు (సిక్కిం, ఆంధ్రప్రదేశ్, ఒడిశా,అరుణాచల్‌ప్రదేశ్), 2024 చివరిలో మరో మూడు (హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్) రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి వుంది. అంటే ఏడాది వ్యవధి (నవంబర్ 2023-నవంబర్ 2024 మధ్య) మొత్తం 12 రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతాయి. కేంద్రం ఒకవైపు జమిలి ఎన్నికల ఆలోచన చేస్తోంది. వీటిలో ఏడు రాష్ట్రాలు పెద్దవి, మిగిలిన అయిదు చిన్న రాష్ట్రాలు. ఈ రాష్ట్రాలలో మెరుగైన ఎంపీ సీట్లు సాధించడం బీజేపీకి అత్యంత అవసరంరాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం. తాజాగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఢిల్లీ యాత్రకు వెళ్ళిన నేపథ్యంలో ఏపీలో అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలు రావచ్చుని, తెలంగాణ సహా అయిదు రాష్ట్రాల ఎన్నికలతోపాటే ఏపీ అసెంబ్లీ ఎన్నికలు జరగవచ్చున్న ఊహాగానాలు సడన్‌గా మొదలయ్యాయి. ఒకరోజు పర్యటనకు ఢిల్లీ వెళ్ళిన సీఎం వైఎస్ జగన్.. ముందుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షాని కలిశారు. ఆ తర్వాత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో గంటకు పైగా భేటీ అయ్యారు. ఆ తర్వాత కాసేపు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కూడా సమావేశమయ్యారు. అయితే, మోదీని కలిసి బయటికి వచ్చిన కాసేపటికే ఏపీలో ముందస్తు ఎన్నికలు జరిపించాల్సిందిగా నరేంద్ర మోదీని ఏపీ సీఎం కోరారంటూ జాతీయ మీడియాలో ఓ లీకేజీ వచ్చింది. దీన్ని ఓ జర్నలిస్టు ట్వీట్ చేయడంతో హడావిడి మొదలైంది. ట్వీట్ ఆధారంగా తెలుగు న్యూస్ ఛానల్స్ బ్రేకింగ్ న్యూస్ ప్రారంభించాయి. అయితే కాసేపటికే ఏపీలో ముందస్తు యోచన లేదంటూ జగన్ వెంటే ఢిల్లీ పర్యటనలో వున్న వైసీపీ ఎంపీ మిధున్ రెడ్డి మీడియా ప్రతినిధులకు కాల్ చేసి మరీ చెప్పారు. మరి ఏ నిప్పు లేకుండానే ఈ పొగ బయటికి వచ్చిందా ? అసెంబ్లీని ముందుగానే రద్దు చేసి, అయిదు రాష్ట్రాల ఎన్నికలతోపాటు ఎన్నికలకు వెళ్ళాలని ఏపీ సీఎం జగన్ మదిలో వుందా? లేదా ? లేకుండానే ఈ లీకేజీ ఎలా వచ్చింది? ఈ అంశాలు కాసేపు గందరగోళం కలిగించాయి. ఎందుకంటే అధినేతల అంతరంగాన్ని వారు తమ దగ్గరి వారితో మీడియాకు లీకు చేయిస్తేనేగానీ నిజం వెలుగులోకి రాదు.నిజానికి ఏపీలో ముందస్తు వుండొచ్చన్న ఊహాగానాలు రావడం ఇదే మొదటి సారి కాదు. గత ఆరు నెలలుగా ఈ మేరకు ఏదో ఒక పత్రిక కథనాలు రాస్తూనే వుంది. అయితే తాజాగా జగన్, మోదీ భేటీ తర్వాత ఈ మేరకు లీకేజీ రావడం యాదృచ్ఛికమైతే కాదు. ఎందుకంటే జాతీయ స్థాయిలో బీజేపీ వ్యూహ రచన కర్నాటక ఎన్నికల ఫలితాల తర్వాత మారింది. ఇటీవల విపక్షాలు కొత్తగా కూటమి కట్టేందుకు పాట్నాలో భేటీ నిర్వహించడం, దానికి 17 పార్టీలు హాజరు కావడం, మలి విడత సమాలోచనలు బెంగళూరు సిటీలో జులై 17, 18 తేదీలలో జరపనున్న నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ పంథా మార్చిందనే చెప్పాలి. కొత్త ఆలోచనలు అమలు చేయడం ప్రారంభించింది. తెలుగు రాష్ట్రాల్లో అధికారంలో వున్న పార్టీలతో కూడా బీజేపీ వ్యవహార శైలిలో మార్పు వచ్చినట్లు కనిపిస్తోంది. మే నెల కంటే ముందు తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం పతాక స్థాయిలో వుండింది. కానీ గత రెండు నెలలుగా ఈ రెండు పార్టీల మధ్య మాటల మంటలు గతంలోలాగా లేవు. అధికార బీఆర్ఎస్ కీలక నేతలు కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడుతున్నారు. అడపాదడపా కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, టీ.సర్కార్‌లో నెంబర్ టూ కేటీఆర్, ఆర్థిక మంత్రి హరీశ్ రావు.. కాంగ్రెస్ పార్టీని దుయ్యబడుతున్నారు. అటు ఏపీలో టీడీపీ, జనసేన పార్టీలతో బీజేపీ ఫ్రెండ్‌షిప్ ఖాయమన్న ప్రచారం కూడా సడన్‌గా ఆగిపోయింది. వైసీపీకే అక్కడ బీజేపీ కేంద్ర నాయకత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాలలో అధికార పార్టీల పట్ల కేంద్రంలో అధికారంలో వుంటూ మూడోసారి అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్న భారతీయ జనతా పార్టీ వైఖరి మెతకగా మారడం కచ్చితంగా యాదృచ్ఛికమైతే కాదు. దీని వెనుక సుదీర్ఘ వ్యూహం వుండొచ్చని రాజకీయ విశ్లేషకులు టీవీ డిబేట్లలో అభిప్రాయపడుతుండడం బీజేపీ వైఖరిని లోతుగా విశ్లేషించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతోంది.. ఈక్రమంలో 2024 ఏప్రిల్, మే నెలలో జరగాల్సిన లోక్‌సభ ఎన్నికలను కాస్త ముందుకు అంటే రెండు, మూడు నెలల ముందుకు జరిపితే.. దానికి కేంద్ర ఎన్నికల సంఘం కూడా సానుకూలంగా స్పందిస్తే.. 9 రాష్ట్రాల అసెంబ్లీలతోపాటు లోక్‌సభ ఎన్నికలకు వెళ్ళే అవకాశం వుంటుంది. 2024 ఎండింగ్‌లో ఎన్నికలు జరగాల్సిన మూడు రాష్ట్రాలలో మహారాష్ట్ర, హర్యానాల్లోను బీజేపీ ప్రభుత్వాలే వున్నాయి. సో.. బీజేపీ జాతీయ నాయకత్వం గనక జమిలి ఎన్నికలను ప్లాన్ చేస్తే ఆ రెండు రాష్ట్రాలు కూడా అసెంబ్లీలను రద్దు చేసి.. 2024 జనవరి, ఫిబ్రవరిలలో ఎన్నికలకు రెడీ అవ్వొచ్చు. ఇక బీజేపీతో వైరమున్న జార్ఖండ్ ముక్తి మోర్చా ఆ రాష్ట్రంలో ముందస్తుకు ఏ మేరకు సహకరిస్తుందో ఇప్పుడే చెప్పలేం. కానీ 11 రాష్ట్రాలు ముందుకొచ్చినపుడు జార్ఖండ్ సీఎం హేమంత్ సొరేన్ కూడా ముందుకు వచ్చే అవకాశాలు లేకపోలేదు. ఈ లెక్కన మినీ జమిలి ఎన్నికల వ్యూహంలో భాగంగా బీజేపీ హైకమాండ్ వ్యూహాత్మకంగా ముందుకు వెళుతున్నట్లు కూడా భావించవచ్చు. దేశవ్యాప్తంగా సడన్‌గా జమిలి ఎన్నికలను ప్లాన్ చేస్తే ఆ ప్రయోగం వికటించే అవకాశాలు వున్నాయి. దాంతో కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావడం కూడా అంత ఈజీ కాదు. ఈక్రమంలోనే మినీ జమిలి ఎన్నికలను 2024 జనవరి, ఫిబ్రవరిలో వచ్చేరకంగా ప్రధాని మోదీ, అమిత్ షా ప్లాన్ చేస్తున్నారేమో అనిపిస్తోంది. ఏపీ ముందస్తుపై వచ్చిన లీకేజీ కూడా వైసీపీ నుంచి వస్తే ఆ వెంటనే దానికి ఖండించే వారు కాదు. ఆ లీకేజీ బీజేపీ వైపు నుంచి వచ్చిందా అన్న అనుమానాలు కూడా వినిపిస్తున్నాయి. మినీ జమిలి ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీతో నేరుగా తలపడే రాష్ట్రాలలో ఒకరకమైన వ్యూహం, థర్డ్ పార్టీతో తలపడే రాష్ట్రాలలో ఇంకోరకం వ్యూహాన్ని కమలనాథులు అవలంభించే సంకేతాలున్నాయి. అందులో భాగంగానే తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ పట్ల, ఏపీలో వైఎస్సార్సీపీ పట్ల బీజేపీ వైఖరి మారి వుండొచ్చు. ఇక్కడ ఇంకో అంశాన్ని కూడా చెప్పుకోవాలి. మహారాష్ట్ర తరహా పాలిటిక్స్ బీహార్‌లోను మొదలైన సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే ఆ రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం ఏర్పడవచ్చు. దానిని సాకుగా చూపి అక్కడ కూడా అసెంబ్లీ రద్దు చేసి, ఎన్నికల దిశగా అడుగులు పడొచ్చు. అపుడు మినీ జమిలిలో 13వ రాష్ట్రంగా బీహార్ కూడా చేరుతుంది. ఇక గత నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రపతి పాలనలో వున్న జమ్మూ కశ్మీర్‌లో ఇపుడు దాదాపు సాధారణ పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో మినీ జమిలిలో ఆ రాష్ట్రాన్ని కూడా కలిపే అవకాశాలున్నాయి. మొత్తమ్మీద ప్రాంతీయ పార్టీల కంటే కూడా జమిలి ఎన్నికల వ్యూహంతో కేంద్రంలోని బీజేపీ నాయకత్వమే ముందస్తు వ్యూహరచన చేస్తుందన్న సంకేతాలకు ఆస్కారమిస్తున్నాయి. ఈ మధ్యనే తెలంగాణ సహా అయిదు రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులను మార్చడం, త్వరలో మరో ఆరు రాష్ట్రాల బీజేపీ యూనిట్ల ప్రెసిడెంట్లను మార్చబోతూ వుండడం మినీ జమిలి ఊహాగానాలకు బలం చేకూరుస్తున్నాయి.

# టాప్ రంగారెడ్డి... లాస్ట్ కొమరం భీమ్

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** సర్కారుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి భారీగా ఆదాయం సమకూ రుతున్నది. వ్యవసాయేతర భూములు, స్థలాలు, ఇతరాల నుంచే అత్యధికంగా వస్తున్నది. ధరణి ప్రారంభించిన తర్వాత వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను స్థానిక రెవెన్యూ తహిసిల్దార్లకు అప్పగించిన నేపథ్యంలో అపార్ట్‌మెంట్లు, ఓపెన్ ప్లాట్లు, వ్యక్తిగత నివాస గృహాల రిజిస్ట్రేషన్లు పుంజుకున్నాయి. ప్రస్తుతం వ్యవసాయేతర స్థలాల దస్తావేజులను పరిశీలిస్తే రాష్ట్రం మొత్తంలో గత నాలుగేండ్లల్లో ప్రభుత్వానికి భారీగా ఆదాయం వచ్చింది. 2018-19 సంవత్సరంలో 15.08 లక్షల డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్(దస్తావేజు) చేయగా, రూ.5837 కోట్ల మేరకు ఆదాయం వచ్చినట్టు స్టాంపులు,రిజిస్ట్రేషన్ల శాఖ లెక్కలు చెబుతున్నాయి. అలాగే 2022-23కు వచ్చేసరికి అటు ఆదాయం మరింత పెరిగింది. సుమారు 12 లక్షల డాక్యుమెంట్లకుగాను రూ.10,669 కోట్ల ఆదాయం సర్కారు ఖజానాలో జమ అయింది. కాగా 2021-22 సంవత్సరంలో కరోనా మూలంగా ఆదాయం సగానికి సగం తగ్గింది. 9,43,893 దస్తావేజులకుగాను రూ.4204 కోట్లు మాత్రమే రావడం గమనార్హం.

**భౌతిక స్వరూపం**

ప్రభుత్వానికి పలు మార్గాల్లో ఆదాయం సమకూరుతుంది. అబ్కారీ శాఖ, మైనింగ్, రిజిస్ట్రేషన్లు తదితర శాఖల నుంచి భారీగా ఆదాయం వస్తుంది. అందులో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కూడా ప్రధానమైంది. రాష్ట్ర వ్యాప్తంగా 33 రెవెన్యూ జిల్లాలు ఉంటే, రిజిస్ట్రేషన్ జిల్లాలు 12. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, హైదరాబాద్ సౌత్, మెదక్, నల్లగొండ, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా కార్యాలయాలు ఏర్పాటు చేశారు.ఇకపోతే దాదాపు 144 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. కొత్తగా ఇటీవల పటాన్‌చెరు, రామగుండం, జయశంకర్ భూపాల పల్లిలోనూ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులను అవసరాలరీత్యా తెరిచారు. గత ఐదేండ్ల లెక్కలను పరిశీలిస్తే రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ప్రభుత్వానికి పెద్దమొత్తంలో ఆదాయం ముడుతున్నది.

**దస్తావేజులు..ఆదాయం**

| సంవత్సరం | దస్తావేజులు | రుసుం(రూ.కోట్లల్లో) |
|---|---|---|
| 2018-19 | 15,04,876 | 5,837 |
| 2019-20 | 16,14417 | 6,241 |
| 2020-21 | 12,05,510 | 9,231 |
| 2021-22 | 94,38,93 | 4204 |
| 2022-23 | 1207060 | 10,669 |

**జిల్లాల పరిస్థితి**

ఆదాయం అత్యధికంగా రంగారెడ్డి జిల్లా నుంచే వస్తున్నది. 2023-24 తాజా సంవత్సరం లెక్కల ప్రకారం రంగారెడ్డిలో ఎక్కువ ఆదాయం వచ్చింది. రంగారెడ్డిలో ఇప్పటివరకు 1,18,072 డాక్యుమెంట్లను రిజిస్టర్ చేయగా రూ.1961.80 కోట్లు ఆదాయం వచ్చి ప్రథమస్థానంలో ఉంది. అలాగే మేడ్చల్- మల్కాజ్‌గిరిలో 83,742 డాక్యు మెంట్లకుగాను రూ.1200.75 కోట్లు, హైదరాబాద్‌లో 30,814కుగాను రూ.758.14 కోట్లు, సంగారెడ్డిలో 36,294 దస్తావేజులకుగాను రూ.419.65 కోట్ల ఆదాయం సమకూరింది. హైదరాబాద్‌లో రిజిస్ట్రేషన్లు తక్కువైనా, భూముల విలువలు భారీగా ఉన్న నేపథ్యంలో అదాయం అధికంగా వచ్చింది. ఇదిలావుండగా కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 1,398 డాక్యుమెంట్లకుగాను రూ.3.94 కోట్ల మేర ఆదాయం మాత్రమే సర్కారు ఖజానాలో జమ అయింది.

# సిద్ధిపేటలో వివక్ష...

**మెదక్- ప్రభాత సూర్యుడు :** దళితులకు సెలూన్ షాపులో కటింగ్ వేయమని వివక్ష చూపుతున్న ఘటన సిద్దిపేట జిల్లాలో చోటుచేసుకుంది. గ్రామపెద్దల ఆదేశాలతో దళితులను షాపులోకి అనుమ తించ డంలేదు. మద్యం మత్తులో దళితుడిపై మూత్రవిసర్జన చేసిన అమానవీయ ఘటన మరువక ముందే మరో ఘటన వెలుగుచూసింది. దళితులపై వివక్ష చూపుతూ సెలూన్ షాప్ లోకి రానీయకుండా అమానుషంగా ప్రవర్తించారు. ఈ ఘటన సిద్ధిపేట జిల్లా జగదేవ్ పూర్ మండలం తిమ్మాపూర్‌లో చోటు చేసుకుంది. గత కొన్నాళ్లుగా దళితులకు హెయిర్ సెలూన్‌లలో కటింగ్ చేసేందుకు నాయీ బ్రాహ్మణులు నిరాకరి స్తున్నారు. ఇతర కులాల వారికి సెలూన్ లో కటింగ్ చేస్తామని, దళితులకు మాత్రం చెట్టు కింద చేస్తామని నాయీ బ్రాహ్మణులు చెప్తున్నారు. గ్రామపెద్దలు ఒప్పుకుంటేనే దళితులను సెలూన్ షాపులలో అనుమతిస్తామని చెబుతున్నారు. దీంతో దళితులు చేసేదేంలేక చెట్టుకిందే క్షవరం చేయించు కుంటు న్నారు. దళితులకు షాపులలో ఎందుకు కటింగ్ చేయరని ప్రశ్నిస్తే... గ్రామ పెద్దలు ఒప్పుకోవడం లేదని నాయీబ్రాహ్మణులు అంటున్నారు. దీంతో కులవివక్ష చూపుతున్నారని దళితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. దళితుల పట్ల గ్రామ పెద్దలు వివక్ష చూపడంపై విమర్శలు వస్తున్నాయి.మధ్యప్రదేశ్ లోని సిధి జిల్లాలో దారుణ ఘటన జరిగింది. స్థానికంగా ఉన్న ఒక షాప్ లో మొబైల్ రీచార్జ్ కోసం వచ్చిన దశరథ్ రావత్ అనే గిరిజనుడు, షాప్ బిజీగా ఉండడంతో బయట కూర్చున్నారు. పూటుగా మద్యం తాగి, సిగరెట్ కాలుస్తూ అటువైపు వచ్చిన ప్రవేశ్ శుక్లా...మద్యం మత్తులో దశరథ్ రావత్ ముఖంపై మూత్ర విసర్జన చేశాడు. అక్కడి వారు, ఆ షాపు యజమాని అతన్ని వారించినా వినకుండా, ఆ దారుణానికి పాల్పడ్డాడు. వీడియో తీస్తున్నామని బెదిరించినా పట్టించుకోలేదు. దాంతో ఆ దారుణాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ వీడియో వైరల్ కావడంతో, నెటిజన్లు, ప్రజల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.ఈ ఘటనపై మధ్యప్రదేశ్ ముఖ్య మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ విచారణకు ఆదే శించారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్ష పడేలా చూడాలని పోలీసులను ఆదేశించారు. నిందితుడిపై పోలీసులు ఐపీసీ, ఎస్సీ, ఎస్టీ యాక్ట్ లతో పాటు జాతీయ భద్రత చట్టం కింద కూడా కేసు నమోదు చేశారు. దాంతో పాటు, బాధితుడు దశరథ్ ను భోపాల్ లోని తన అధికారిక నివాసానికి పిలిపించుకున్న సీఎం చౌహాన్.. అతడిని కుర్చీలో కూర్చోబెట్టి, తాను కింద కూర్చుని, పళ్లెంలో అతడి కాళ్లు పెట్టి, ఆ కాళ్లను కడిగి జరిగిన తప్పుకు క్షమాపణ అడిగారు. తాను ప్రజా సేవకుడినని, ప్రజలు తనకు దేవుళ్లతో సమానమని ఈ సందర్భంగా సీఎం వ్యాఖ్యానించారు. ఈ దారుణానికి పాల్పడిన ప్రవేశ్ శుక్లాను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు నివాసాన్ని అధికారులు కూల్చివేశారు .

# మోడీ టూర్ బహిష్కరిస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)

ఆర్ఎస్ఎస్ వ్యక్తి అంటూ ఆరోపించారు. భూ దందాలు చేసే వ్యక్తులే ధరణిని వద్దంటున్నారని విమర్శించారు. ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ కలిసే పని చేస్తున్నాయని చెప్పారు. ఆ పార్టీల మోసాలు అన్నీ తెలంగాణ ప్రజలకు తెలుసని అన్నారు. సీఎం కేసీఆర్ పోరాట పటిమ గురించి అన్ని రాష్ట్రాల ప్రజలకు తెలుసున్నారు. అందుకే ఏ రాష్ట్రానికి వెళ్లినా బీఆర్ఎస్ కు, ముఖ్యమంత్రి కేసీఆర్ కు బ్రహ్మరథం పడుతున్నారని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రధాని మోదీ పాలనులో ఏదైనా జరిగిందంటే నిరుద్యోగం, అప్పులు మాత్రమేనని ఎద్దేవా చేశఆరు. రాహుల్ గాంధీ అడ్డగోలు ఆరోపణలను ప్రజలు పట్టించుకోవడం లేదని చెప్పారు. ఏ అర్హతతో రాహుల్ గాంధీ తమపై ఆరోపణలు చేస్తున్నారో చెప్పాలని అన్నారు. అలాగే ఇటీవలే కుసుమ జగదీష్, సాయిచంద్ హఠాన్మరణాలు తనను ఎంతగానో బాధించాయన్నారు. వీరిద్దరి మరణం పార్టీకి తీరని లోటు అని చెప్పుకొచ్చారు. ఇద్దరి మృతితో సీఎం కేసీఆర్ కూడా కలత చెందారని వివరించారు. సాయిచంద్ , కుసుమ జగదీష్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధుల తరపున రూ. 1 కోటి 50 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు ప్రకటించారు.

# ప్రధాని సభను విజయవంతం చేద్దాం

(మొదటిపేజీ తరువాయి)

అనేకసార్లు కలిశాయి. రాష్ట్రపతి ఎన్నిక సమయంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా కేసీఆర్? మాట్లాడిన విషయం గుర్తుంచుకోవాలి. అవి రెండు బొమ్మ బొరుసు పార్టీలు. గతంలో 18 చోట్ల కాంగ్రెస్ గెలిస్తే..12 మంది బీరెస్ పార్టీలోకి జంప్ అయ్యారు. బీజేపీ మాత్రమే కుటుంబపాలనను అంత మొందించగలదు. బీజేపీ మాత్రమే న్యాయమైన పాలన చేయగలదు. గత 9 ఏండ్లుగా మోడీ ప్రభుత్వం నీతిమంతంగా పనిచేస్తున్నది.? మంచి ప్రభుత్వం తెలంగాణకు అందిస్తాం. చాలా ఏండ్ల తర్వాత భారత ప్రధానిగా మోడీ వరంగల్‌కు వస్తున్నారు. వరంగల్ నుంచి హైదరాబాద్ వరకు సిమెంట్ రోడ్డు వేయించిన ఘనత ప్రధాని మోడీది. వరంగల్ జిల్లాకు టెక్స్‌టైల్ పార్క్ కేంద్రమే మంజూరు చేసింది. వరంగల్ అభివృద్ధి విషయంలో మోడీ ప్రభుత్వం పూర్తి అంకితభావంతో పనిచేస్తున్నది. రైలు మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమలో భవిష్యత్‌లో రైలు ఇంజన్ సహా.. వ్యాగన్లు, కోచ్‌లు ఏమైనా తయారు చేసుకవ్వు. అనుకున్నదానికంటే పెద్ద పరిశ్రమనే కాజిపేటకు వచ్చింది. బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వరంగల్ ఎయిర్‌పోర్టు అంశం మొదటి. కవిత అరెస్ట్ చూడాల్సిన పని బీజేపీది కాదు. సీబీఐ పని అది. కేసిఆర్‌ది కమీషన్ల ప్రభుత్వం. కుటుంబ వాటాలు, పెత్తనం లేని పరిపాలన తెలంగాణలో తీసుకువస్తాం.మామునూర్ ఎయిర్ పోర్ట్ స్థలం విషయంలో నేను, మా అధికారులు రాష్ట్రానికి ఎన్నోసార్లు లెటర్స్ రాశాం. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రాగానే వరంగల్ యెయిర్ పోర్ట్‌కు మొదటి ప్రాధాన్యత. ఎయిర్ జర్నీని బీజేపీ ప్రోత్సాహిస్తుంది. ఓరుగల్లు జనాలు మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలి.స్మార్ట్ సిటీ, అమృత్ వంటి స్కీమ్స్ ఇచ్చాము. పీఎం మిత్ర ద్వారా మెగా టెక్స్ టైల్ పార్క్ కు కేంద్రం నిధులు 550 కోట్లతో జాతీయ రహదారి అనుసంధానంమెగా టెక్స్ టైల్ పార్క్ రావడానికి స్టేట్ తరపున కృషి చేశానని అన్నారు.

## ఓఆర్ఆర్ పై రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మహిళలు మృతి

**మేడ్చల్ - ప్రభాత సూర్యుడు :** తెలంగాణలోని కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. యాద్గార్‌పల్లి సమీపంలో ఓ డీసీఎం కూలీలను ఢీకొట్టింది. దీంతో ఇద్దరు మహిళలు మృతి చెందారు. ఔటర్ రింగ్ రోడ్డుపై మహిళలు పారిశుద్ధ్య పనులు చేస్తోన్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.మృతులను లింగమ్మ , తిరుపతమ్మగా పోలీసులు గుర్తించారు. మృతులు బీరంగూడ ప్రాంతానికి చెందిన వారని పోలీసులు చెప్పారు. మరోవైపు, ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగిన పది నిమిషాలకే అక్కడే మరో ప్రమాదం జరిగింది. ప్రమాదాన్ని చూస్తూ ఓ డ్రైవర్ నిర్లక్ష్యంగా ఆటోను నడిపాడు.దీంతో ఆ ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కు స్వల్ప గాయాలు అయినట్లు తెలుస్తోంది. ఔటర్ రింగ్ రోడ్ పై ట్రాఫిక్ భారీగా స్తంభించింది. అదే సమయంలో మృతులు లింగమ్మ, తిరుపతమ్మ బంధువులు ఔటర్ రింగ్ రోడ్డు పనుల కాంట్రాక్టర్ రావాలంటూ అంబులెన్స్ ను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, మృతుల బంధువులకు మధ్య వాగ్వాదం జరిగింది.

## హైదరాబాద్ ఓల్డ్ సిటీలో బోనాలు షురూ

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** హైదరాబాద్ పాత బస్తీలో బోనాలు ప్రారంభమయ్యాయి. లాల్ దర్వాజ లోని సింహవాహిని మహాంకాళీ అమ్మవారి శిఖర పూజా, ధ్వజారోహనం తో పాత బస్తి లో బోనాల సందడి మొదలయింది. శుక్రవారం జరిగిన శిఖర పూజ లో హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సివి ఆనంద్, జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ వెంకన్న,సౌత్ జూన్ డిసిపి సాయి చేతన్య తదితరులు పాల్గొన్నారు. ఓల్డ్ సిటీలో జూలై 16న బోనాలు, జూలై 17 న భవిష్యవాణి ( రంగం ) కార్యక్రమం జరుగుతాయి. సీపీ సివి ఆనంద్ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆనవా యితీ గా శిఖర పూజలో పాల్గొనడం సంతోషంగా ఉంది. ఓల్డ్ సిటీ బోనాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తామని అన్నారు.

## పట్టాలపై రాళ్లతో నింపిన డ్రమ్ము..తప్పిన ప్రమాదం

**ఔరంగాబాద్ - ప్రభాత సూర్యుడు :** ముంబయి - సికింద్రాబాద్ దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. పట్టాలపై రాళ్లతో నింపిన డ్రమ్మును గుర్తించిన డ్రైవర్ వెంటనే ఎమర్జెన్సీ బ్రేక్లు వేసి రైలును ఆపారు. దీంతో ప్రమాదం తప్పింది. మహా ఓరాష్ట్రలోని జల్నా జిల్లాలో శుక్రవారం తెల్లవారు జామున ఈ ఘటన చోటుచేసుకుంది. ముంబయి నుంచి సికింద్రాబాద్ బయల్దేరిన ఈ రైలు శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో సతోనా - ఉస్మాన్పుర్ స్టేషన్ల మధ్య ప్రయాణిస్తుండగా పట్టాలపై ఏదో వస్తువు ఉండటాన్ని లోకోపైలట్ గుర్తించారు. అప్రమత్తమైన పైలట్ రైలును ఆపి కిందకు దిగి చూడగా.. ట్రాక్ మధ్యలో రాళ్లలో నిండిన డ్రమ్ము కన్పించింది. దీంతో లోకోపైలట్ వెంటనే రైల్వే భద్రతా సిబ్బంది (ఆర్పీఎఫ్)కి సమాచారమిచ్చారు. ఆర్పీఎఫ్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని డ్రమ్మును తొలగించారు. ఆ తర్వాత రైలు తిరిగి సికింద్రాబాద్ బయల్దేరింది. ఈ ఘటనలో రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని అధికారులు

# చదువుల తల్లికి నాగవల్లి దళార్చన



జగిత్యాల - ప్రభాత సూర్యుడు : జగిత్యాల అర్బన్ కాలనీ తారకరామా నగర్ లో కొండపై వేంచేసి ఉన్న చదువుల తల్లి సరస్వతి మాత ఆలయంలో పవిత్ర ఆషాడ మాసము శుక్రవారం సందర్భంగా మా తలచే నాగవల్లి దళార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీమాతను భక్తులు విశేష సంఖ్యలో దర్శించుకున్నారు. విచ్చేసిన భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు తీర్థ ప్రసాదము తో పాటు ఆశీర్వచనం చేశారు. అమ్మవారి నామస్మరణతో ఆలయమంతా మారుమోగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని సాంప్రదాయ బద్ధంగా సర్వాంగ సుందరంగా అలంకరించారు. విశేష సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ పరిసరాలు అంత పండుగ వాతావరణం సంతరించుకుంది.

# హారన్ కొట్టినందుకు హతమార్చారు



ఖమ్మం - ప్రభాత సూర్యుడు : ఖమ్మం నగరంలోని పంపింగ్ వెల్ రోడ్ లో దారుణం చోటు చేసుకుంది. బైక్ హారన్ సౌండ్ విషయంలో జరిగిన ఘర్షణ లో సాయి పవన్ అనే యువకుడు మృతి చెందాడు. గురువారం అర్ధరాత్రి సమయంలో పవన్ సాయి బైక్ పై వెళ్తూ ఆ సమయంలో హారన్ కొట్టడంతో మద్యం మత్తులో ఉన్న అఖిల్, అశోక్ అనే యువకులు సాయి పవన్ ను ఆపి ఘర్షణకు దిగారు. మత్తులో ఉన్న యువకులు విచక్షణను కోల్పోయి చాకుతో పవన్ సాయి పై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో పవన్ సాయి మృతి చెందగా మరో యువకుడుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సీఎం కేసీఆర్ నియోజకవర్గంలో దళితులపై వివక్ష

### - టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : గజ్వేల్ నియోజకవర్గం జగదేవపూర్ మండలంలోని తిమ్మాపూర్ లో దళితులపై ఇంత ఘోరం జరుగుతుంటే ప్రభుత్వం ఏమి చేస్తుందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి ప్రశ్నించారు. చట్టాలు ఏమి చేస్తున్నాయి.. దళిత బంధు అంటూ దళితులను మోసం చేసేందుకు కుట్రలు చేస్తున్న కేసీఆర్. తన నియోజక వర్గంలో దళితులను దశాబ్ది ఉత్సవాల్లో సహపంక్తి బోజనాలకు రానివ్వకపోతే ఏమి చేశారు. కనీసం అందరితోపాటు కటింగ్స్ కూడా రానివ్వకపోవడం ఎంత దారుణమని అన్నారు. ఇందిరాగాంధీ ప్రభుత్వ హయాంలో దళితులపై అరాచకాలు జరిగితే వెంటనే ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకునేది. దాంతో అప్పట్లో దళిత, గిరిజన, నిమ్న వర్గాలు చాలా సంతోషంగా ఉన్నాయి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.. దళితుల పట్ల తీవ్ర వివక్ష కొనసాగుతుంది. తిమ్మాపూర్ లో జరిగిన సంఘటనపై ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణ జరపాలి. ఎస్సి కమిషన్ వెంటనే రంగంలోకి దిగి తగిన విచారం చేసి దోషులకు శిక్ష వేసి బాధితులకు భరోసా కల్పించాలని అయన అన్నారు.

# ఫలక్ నామా ఎక్స్ ప్రెస్ లో అగ్ని ప్రమాదం

### ప్రయాణికులు సురక్షితం

యాదాద్రి - ప్రభాత సూర్యుడు : ఇటీవల కాలంలో తరచూ ఏదో ఒక ప్రాంతంలో రైలు ప్రమాదాలు జరుగుతుండడం చూస్తూనే ఉన్నాం. కాగా తాజాగా ఫలక్ నుమా సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. హౌరా నుంచి సికింద్రాబాద్ వస్తున్న రైలు.. తెలంగాణలోని యాదాద్రి జిల్లా పగిడిపల్లిలోకి రాగానే ఒక్కసారిగా ఏర్పడిన షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయి. ఈ మంటల్లో ఎస్ 4, ఎస్5, ఎస్ 6 బోగీలు పూర్తిగా మంటల్లో చిక్కుకుని దగ్ధమయ్యాయి. కాగా ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలతో మంటలు ఎగిసిపడ్డాయి. రైల్లో పొగలు రావడంతో అప్రమత్తమైన రైల్వే సిబ్బంది లోకోపైలెట్ కు సమాచారం అందించారు. దీనితో వెంటనే స్పందించిన లోకోపైలెట్ రైలును నిలిపివేయడంతో ప్రయాణకులంతా పరుగు పరుగున రైలు నుంచి దిగిపోయారు. దీనితో పెను ప్రమాదం తప్పిందనే చెప్పాలి.

# గర్భిణులకు అన్నదానం



మద్దికేర -ప్రభాత సూర్యుడు : మండల కేంద్రమైన మద్దికేర గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం వారు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. గర్భిణీలు,పలువురు వ్యాధిగ్రస్తులు వైద్యపరీక్షలు,వైద్యం కోసం చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు ప్రభుత్వ వైద్యశాలకు వస్తుంటారు.వారికోసం అన్నదానం కార్యక్రమం చేపట్టామని ఆలయ నిర్వాహకులు విజయ ప్రసాద్ యాదవ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నాగేష్, శ్రీలక్ష్మి, స్టాఫ్ నర్సులు,ఆశా వర్కర్లు,సేవకులు తదితరులు పాల్గొన్నారు.

### దొంగతనాల నివారణకు

# పెట్రోలింగ్,నిఘా వ్యవస్థను మరింత పటిష్ట పరచాలి


**అనుమానిత వ్యక్తుల కదలిక పై సమాచారం ఇవ్వండి**
**జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్**



జగిత్యాల - ప్రభాత సూర్యుడు : జిల్లాలో చోటుచేసుకుంటున్న దొంగతనాలపై పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి నిఘాను పటిష్టం చేయాలని జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ సూచించారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం నుండి జిల్లాలో జరుగుతున్న దొంగతనాల నివారణ పై డీఎస్పీలు, సి.ఐలు, ఎస్.ఐలతో ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలోని పౌరులందరికీ తమ యొక్క ఆస్తిపాస్తులు సురక్షితం అనే భరోసా కల్పిస్తూ అన్ని వనరులను సమర్థవంతంగా ఉపయోగిస్తూ ఎల్లవేళల నిఘా వ్యవస్థను పకడ్బందీగా అమలు పరుస్తూ విధులు పక్కగా నిర్వహించాలన్నారు. దొంగతనాల కేసుల్లో ప్రతిరోజు కేసు ఛేదన గురించి అన్ని కోణాల్లో ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఎస్ఓపి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి కేసులు ఛేదించాలని సూచించారు.నేరస్తుల యొక్క ఫోటోలు తయారుచేసి ఏంవో నేరస్తుల వారీగా ఆల్బమ్ తయారు చేయాలని సూచించారు. బస్టాండ్లలో ప్రజలు రద్దీగా ఉండే ప్రదేశాలు నిఘా ఉంచాలని తెలిపారు. గత పది సంవత్సరాల నుండి దొంగతనాలు చేసిన నేరస్తుల యొక్క బయోడేటా తయారు చేసి వారి యొక్క కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరుచుకుని ఇన్ఫర్మేషన్ వ్యవస్థను రూపొం దించుక ోవాలని సూచించారు.జిల్లాలో ఎక్కడ దొంగతనం జరిగినా నేర స్థలాన్ని సందర్శించాలని దానిద్వారా నేరం ఎలా చేశారు, ఎవరు చేశారని తెలుసుకోవచ్చని తెలిపారు. జిల్లాలో ఉన్న అధికారులకు, సిబ్బందికి ఏ ఇన్ఫర్మేషన్ వచ్చిన అందరితో షేర్ చేసుకుని విధులు నిర్వహి ంచినప్పుడు రాణించగలుగుతారు అని తెలిపారు. గ్రామాల్లో, పట్టణాల్లో, కాలనీలలో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసు వారికి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. పోలీసు శాఖ వారు సూచించిన సూచనలను పాటించి దొంగతనాల నివారణకు ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు.

### పట్టణ కాంగ్రెస్

# మైనారిటీ ప్రధాన కార్యదర్శిగా హాబీబ్



జగిత్యాల - ప్రభాత సూర్యుడు : జగిత్యాల పట్టణ కాంగ్రెస్ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ హాబీబ్ ను పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షుడు నేహాల్ నియామకం చేసినట్లు ఆయన తెలిపారు..ఈ మేరకు శుక్రవారం స్థానిక ఇందిరా భవన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి నియామక పత్రాన్ని హాబీబ్ కు అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా హాబీబ్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కు కృతజ్ఞతలు తెలిపారు.కార్యకర్తలను ఏకతాటి పైకి తీసుకు వచ్చి, సమష్టిగా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు గిరి నాగభూషణం, పిసిసి మైనారిటీ సెల్ కార్యదర్శి మోయిజొద్దీన్, కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు సిరాజొద్దిన్ మన్సూర్, షకీల్ ఖాన్ పాల్గొన్నారు.

### ప్రజల కోరిక

# మేరకే పట్టణంలో రోడ్డు విస్తరణపనులు

### ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ



పత్తికొండ - ప్రభాత సూర్యుడు : పత్తికొండ పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజల కోరిక మేరకే పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టామని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ తెలిపారు.పత్తికొండ పట్టణ లోరోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా స్థలాలను కోల్పోతున్న కుటుంబాలతో స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో సమావేశాన్ని నిర్వహించారు. ఆర్డిఓ, ఆర్ అండ్ బి, ఎమ్మార్వో ,అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ భవిష్యత్తు కోసం కొంచెం ఇబ్బందిగా ఉన్నప్పటికీ స్థలాలు కోల్పోతున్న వారు సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. గతంలో నేతలు రోడ్డు విస్తరణను గాలికి వదిలేశారని, ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రజల విజ్ఞప్తి మేరకు సీఎం జగనన్నతో మాట్లాడి నిధులు కేటాయించేలా ఒప్పించానని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ చెప్పారు. అందరూ సహకరించి త్వరగా ముందుకు వస్తే పనులు త్వరగా పూర్తి చేసి పత్తికొండను సుందరీకరిస్తామని ఎమ్మెల్యే శ్రీదేవమ్మ విజ్ఞప్తి చేశారు. ఎవరిని ఇబ్బంది పెట్టడం తమ ఉద్దేశం కాదని, కేవలం అభివృద్ధి కోసమే పనులు చేపడుతున్నామని, ఎవరెన్ని అడ్డంకులు సృష్టించిన రోడ్డు విస్తరణ పనులు ఆగవని ఎమ్మెల్యే శ్రీదేవమ్మ స్పష్టం చేశారు.

# స్మశాన వాటికలో ముళ్ళ చెట్లు తొలగింపు

తుగ్గలి - -ప్రభాత సూర్యుడు :

మండల పరిధిలోని పెండేకల్లు ఆర్ఎస్ గ్రామంలో స్మశాన వాటికలో ముళ్ళ చెట్లను తొలగించి పారిశుద్ధ్య పనులను నిర్వహించినట్లు జర్నలిస్టు మాధవ్ తెలియజేశారు.స్మశాన వాటికలో పెరిగిన ముళ్ళ చెట్ల వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతో,ఎవరు పట్టించుకోవడంతో తానే స్వయంగా శుక్రవారం రోజున జెసిబి ద్వారా ముళ్ళ చెట్లను తొలగించినట్లు జర్నలిస్ట్ మాధవ్ తెలియజేశారు.జర్నలిస్టు మాధవ్ చేసిన పనులకు గ్రామ ప్రజలు అభినందించారు.

### ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో

# ఫీజుల బోర్డును ఏర్పాటు చేయాలి




ఎమ్మిగనూరు - ప్రభాత సూర్యుడు : ఎమ్మిగనూరు పట్టణంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలలో ఫీజులు నియంత్రణ చట్టాన్ని అమలు చేయడంలో విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలం చెందారని, ప్రభుత్వ పాఠశాల హెచ్ఎంలు నాడు - నేడు, జెవిడిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు మహేంద్ర బాబు, నరసన్న విరేష్ యాదవ్, ఆఫ్రిది రఘునాథ్ ,రామకృష్ణ , ప్రభుత్వ ఎంపీపీ హాల్లో ప్రవేట్ ప్రభుత్వ ఉపాధ్యాయుల సమావేశము జరుగుతున్న సమావేశాన్ని అడ్డుకొని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి, ఫీజుల బోర్డును ఏర్పాటు చేయడం లేదని, నిబంధనలే పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఎంఈఓలు ఆంజనేయులు, మధుసూదన్ రాజుకు ప్రవేట్ పాఠశాలలపై తనకిలు నిర్వహించి, వారం వారం తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ ప్రవేట్ పాఠశాల పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించి, ప్రభుత్వం నిర్ణయించిన విధి విధానాలు అమలు చేయాలని నేను పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

# ప్రజల సౌకర్యార్థమే వార్డ్ ఆఫీసుల ఏర్పాటు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : ప్రజల సౌకర్యార్థమే వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేసామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం నాడు అయన అమీర్ పేట డివిజన్ శ్రీరాం నగర్ లో పర్యటించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలనేది ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన. అన్ని శాఖల అధికారులు వార్డ్ ఆఫీస్ లో అందుబాటులో ఉంటారు. సమస్యల పరిష్కారం కోసం వార్డ్ ఆఫీస్ సేవలను వినియోగించుకోవాలి. 50, 60 సంవత్సరాలలో జరగని అభివృద్ధి 9 సంవత్సరాలలో జరిగాయి. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని అన్నారు.

# త్వరలో జిపిఎఫ్ ఖాతాల బదలాయింపు

### జడ్పీ చైర్పర్సన్ దావ వసంత



జగిత్యాల - ప్రభాత సూర్యుడు : త్వరలో జిపిఎఫ్ ఖాతాల బదులు జరుగుతుందని జగిత్యాల జడ్పీ చైర్ పర్సన్ దావా వసంత సురేష్ అన్నారు.జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోతే, చిన్న మెట్పల్లి పాఠశాలల ఇంగ్లీష్ మీడియం అప్గ్రేడేషన్ కోసం అవసరమైన అండర్ టేకింగ్ సర్టిఫికెట్లను జెడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్పర్సన్ మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి నూతనంగా ఏర్పడిన జగిత్యాల జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయుల జిపిఎఫ్ ఖాతాలు బదలాయింపు ప్రక్రియ చివరి దశకు చేరుకుందని త్వరలోనే అందరు ఉద్యోగ ఉపాధ్యాయుల జిపిఎఫ్ ఖాతాలు జగిత్యాల జిల్లాకు బదలాయింపు జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ టిఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు యాళ్ళ అమర్నాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయిన్పల్లి ఆనందరావు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215